ఎల్‌పీఎం గుదిబండ..!


కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

శాశ్వత భూ హక్కుల పేరిట గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) విధానం రైతుల పాలిట గుదిబండగా తయారైంది. దశాబ్దాల కాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీఎం తీసుకురావడంతో సబ్ రిజిస్ట్రార్లకు కొత్త సమస్య తలెత్తింది. రిజిస్ట్రేషన్ విలువ ఖరారులో స్థిర నిర్ణయానికి రాలేకపోతున్నారు. భూముల క్రయ విక్రయాలకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రీసర్వేకు ముందు ఒక రైతులకు వివిధ ప్రాంతాల్లో భూములు ఉంటే వేర్వేరు సర్వే నంబర్లు ఉండేవి. ఆ భూములు ఉండే ప్రాంతాలను బట్టి రిజిస్ట్రేషన్ విలువల్లో హెచ్చుతగ్గులు ఉండేవి. రీసర్వే తరువాత వేర్వేరు చోట్ల భూములన్నింటినీ కలిపి ఒకే ఎల్‌పీఎం నంబరు ఇచ్చారు. పక్కపక్కనే ఉన్న ఐదారుగురు రైతుల భూములన్నింటికీ ఒకే ఎల్పీఎం నంబరు ఇచ్చారు. ఆ నంబర్లు మేరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రిజిస్ట్రేషన్ల కోసం వెళితే.. ఎల్‌పీఎం నంబరులో ఎంత విస్తీర్ణం ఉందో అంతటికీ రిజిస్ట్రేషన్ విలువ చూపుతోంది. మొత్తం భూమి విస్తీర్ణం సెలెక్ట్ చేస్తుంది. సాంకేతిక సమస్యల కారణంగా ఆర్థిక ఇబ్బందులతో భూములు అమ్ముకున్న రైతులు.. కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎల్‌పీఎం సమస్యతో దాదాపు 2,500కు పైగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయి ఖజానాకు రావాల్సిన రూ.55 కోట్లకు పైగా రాబడి కోల్పోవాల్సి వచ్చింది.

- వైసీపీ హయాంలో తెచ్చిన విధానంతో రైతులకు అవస్థలు
- తగ్గిపోతున్న రిజిస్ట్రేషన్లు.. ఖజానాకు ఆదాయం కోత
- కూటమి ప్రభుత్వం వచ్చినా అదే దుస్థితి
- ఎల్‌పీఎం నంబరు కోసం రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో 2,500కు పైగా రిజిస్ట్రేషన్లు పెండింగ్


సాగు భూములు

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా చేసిన నిర్ణయాలు రైతుల పాలిట శాపంగా మారాయి. రీ సర్వే పేరిట దశాబ్దాలుగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) నంబర్లు తీసుకొచ్చింది. రెవిన్యూ రికార్డుల ప్రకారం కర్నూలు జిల్లాలో 472 రెవిన్యూ గ్రామాలు ఉంటే 252 గ్రామాల్లోనూ, నంద్యాల జిల్లాలో 462 రెవిన్యూ గ్రామాలకు గానూ 215 గ్రామాల్లో రీ సర్వే చేశారు. సర్వే చేసిన గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్లు కర్నూలు జిల్లాలో 65 వేలు, నంద్యాల జిల్లాలో 75 వేలకు పైగా ఖాతాలకు ఇచ్చారు. ప్రస్తుతం భూములు క్రయవిక్రయాలు జరిగితే ఈ ఎల్‌పీఎం నంబర్లు ద్వారానే రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంది. ఇక్కడే అసలు సమస్య మొదలవుతుంది. పక్కపక్కనే భూములు ఉన్న రైతులు అందరికి ఒకే ఎల్‌పీఎం నంబరు ఇవ్వడం, సబ్ డివిజన్ చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్లూరు మండలం ఏ. గోకులపాడు గ్రామంలో ఓ రైతు తనకున్న పదెకరాల పొలంలో ఐదు ఎకరాలు కర్నూలు నగరంలోని ఓ వ్యక్తికి విక్రయించాడు. అగ్రిమెంట్ గడువు ముగుస్తుండడంతో రిజిస్ట్రేషన్ కోసం కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే.. ఆ ఎల్‌పీఎం నంబరులోని పూర్తి విస్తీర్ణం సెలెక్ట్ అవుతుంది. ఆదోని మండలం కపటి గ్రామానికి చెందిన ఓ రైతు పొలం అమ్మాడు. నెల రోజుల క్రితం రిజిస్ట్రేషన్ కోసం ఆదోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వెళితే.. ఆ రైతుతో పాటు ఎల్‌పీఎం నంబరు పరిధిలో ఉన్న ఐదారుగు రైతుల భూమి కూడా సెలెక్ట్ అయింది. సబ్ డివిజన్ చేసి కొత్త ఎల్‌పీఎం నంబరు తెచ్చుకునే వరకు రిజిస్ట్రేషన్ చేయలేమని తేల్చేశారు. ఎల్‌పీఎం నంబరు కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టు తిరుగుతున్నా ఫలితం శూన్యం.

మిగతా 6లో..



మెరిసిన తారలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలులో సినీ తారలు మెరిశారు. ఓ ప్రముఖ షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా సార్ సినిమాలో నటించిన సంయుక్త మీనన్, లక్కీ భాస్కర్ మూవీలో నటించిన మీనాక్షి చౌదరి బుధవారం నగరానికి విచ్చేశారు. వీరిని చూడడానికి ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది.

డీటీవోగా ఐశ్వర్య రెడ్డి



నంద్యాల రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా రవాణాశాఖ అధికారి(డీటీవో)గా ఐశ్వర్య రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయ వాడలో ఆర్టీవోగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై నంద్యాల డీటీవోగా వచ్చారు. నంద్యాల డీటీవో కార్యాలయంలో ఎంవీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ గతంలో నంద్యాల డీటీవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించేవారు. శ్రీకాంత్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఎంవీఐతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం సిబ్బంది డీటీవోను మర్యాదపూర్వకంగా కలిశారు.

కోడి గుడ్డు ధర పైపైకి..!



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్ల ధర రోజురోజుకూ పైపైకి పోతోంది. గత సంవత్సరం ఇదే సమయానికి ఒక గుడ్డు ధర రూ.5ఉండగా.. ప్రస్తుతం రూ.7 నుంచి రూ.8 పలుకుతోంది. గత వేసవిలో గుడ్ల ఉత్పత్తి పడిపోగా ఎండ వేడిమికి దాదాపు లక్ష కోళ్లు మృతి చెందాయి. పౌల్ట్రీ పరిశ్రమకు సుమారు రూ.50 నుంచి రూ.60 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా.. కోళ్లకు మేతగా వినియోగిస్తున్న మొక్కజొన్న టన్ను ధర పెరిగింది. టన్ను రూ.22 వేల నుంచి రూ.24 వేలు, నూకలు రూ.18 వేల నుంచి రూ.22 వేల దాకా పెరిగాయని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. మొత్తం మేత ధర టన్ను రూ.26 వేల వరకు పెరగడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పెరిగిన నిర్వహణ వ్యయంతో ప్రస్తుతం గుడ్డు ఉత్పత్తి వ్యయం రూ.5కు చేరుతోందని, ప్రస్తుతం ఒక గుడ్డు ధర రూ.7కు పెరగడం వల్ల కొంత గిట్టుబాటు అవుతున్నట్లు వారు చెబుతున్నారు. కరోనా తర్వాత గుడ్ల ఉత్పత్తి భారీగా తగ్గిపోయి పౌల్ట్రీ రైతులు ఇప్పటికీ కోలుకోలేదు. ప్రస్తుతం ఉన్న కోడిగుడ్డు ధర ఆశాజనకంగా ఉన్నా రైతుకు అందుతున్నది తక్కువనే చెప్పాలి. ఈ ధర ఇలాగే ఐదు నెలల వరకు ఉంటే తమకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని పౌల్ట్రీ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య వినియోగదారులు మాత్రం గుడ్డు ధర పెరుగుతుండటంపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

శ్రీశైలంలో శివదీక్ష విరమణ


స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, సిబ్బంది, భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాస శివదీక్షా విరమణల కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పాతాళగంగ మార్గంలోని శివదీక్షా శిబిరాల్లో దీక్షా విరమణ కార్యక్రమాన్ని దేవస్థానం ఐదు రోజుల పాటు నిర్వహించనుంది. కార్యక్రమంలో ముందుగా దీక్షా విరమణను పురస్కరించుకుని స్వామివారి ఆలయ దక్షిణద్వారం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను జేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య వేదమంత్రాలతో పల్లకిలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లను రథవీధిలో ఊరేగింపుగా శివదీక్షా శిబిరాల వద్దకు తీసుకెళ్లి కొలువుదీర్చి షోడశోపచారలతో పూజాదికాలు నిర్వహించి, తరువాత హోమగుండానికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి హోమాగ్నిని ప్రజ్వలింపజేశారు. అనంతరం ఓం నమఃశివాయ ప్రణవ పంచాక్షరీ నామస్మరణతో శివదీక్షా విరమణ కార్యక్రమం ప్రారంభమైంది. జ్యోతిర్ముడిని కలిగిన శివస్వాములు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని దీక్షా విరమణ చేశారు. శివదీక్షను స్వీకరించిన భక్తులకు నిర్దీత వేళలో ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నారు.


శివ దీక్షను విరమిస్తున్న భక్తులు

పంటలకు మరో తుఫాన్ గండం



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మరో వాయుగుండం కర్నూలు జిల్లా రైతాంగాన్ని నష్టపరిచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వారం కిందట ఫెంగల్ తుఫాన్‌తో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలన్నీ నీటి పాలై దిగుబడి పూర్తిగా తగ్గిపోయి ఉమ్మడి జిల్లా రైతులు నష్టపోయారు. ఇప్పుడిప్పుడే వానగండం నుంచి తేరుకున్న రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. గోరుచుట్టుపై రోకటి పోటులా బంగాళాఖాతంలో మరో తుఫాన్ ఏర్పడబోతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో కలెక్టర్ పి.రంజిత్ బాషా రైతులను అప్రమత్తం చేయాలని, చేతికొచ్చిన పంటలు నీటి పాలు కాకుండా కాపాడాలని వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని, పంట కోతలకు రైతులు సిద్ధం కాకుండా వాయిదా వేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముచ్చటగా మూడోసారి
సాగునీటి సంఘాల ఎన్నికలకు
గెజిట్ నోటిఫికేషన్ జారీ
7

ముగ్గురు దొంగల అరెస్టు

కరాటేలో దిట్ట.. రిదా రేష్మ..
- అంతర్జాతీయ స్థాయిలో రజితం
- జాతీయ స్థాయిలో బంగారు పతకం
6

చెంతనే నీరు.. అందని తీరు..!


అవుకు రిజర్వాయర్

బనగానపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఎస్సార్బీసీ (శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్) ద్వారా 1,53,936 ఎకరాలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎస్సార్బీసీ కాలువలు, పంట కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్మించింది. 2000 సంవత్సరం నాటికి పనులు పూర్తయ్యాయి. 2002 నుంచి ఎస్సార్బీసీకి నీరు విడుదల చేయడంతో సాగు నీరు పారుతోంది. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలతోపాటు పాణ్యం, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లో 1,53,936 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. అయితే ప్రధాన కాల్వలు దెబ్బతినడం, పంట కాల్వలు లేకపోవడంతో ఆయకట్టుకు నీరు అందడం లేదు. ప్రస్తుతం సుమారు 42 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నేటికీ సాగు నీరు అందడం లేదు.

- దెబ్బతిన్న పంట కాలువలు
- ప్రశ్నార్థకంగా చివరి ఆయకట్టు



రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం

గోరుకల్లు రిజర్వాయర్లలో 12.44 టీఎంసీల నీటిని నిల్వ ఉండాలి. అవుకు రిజర్వాయర్‌లో 4.148 టీఎంసీల నీటిని నిల్వ ఉంచాలి. అలాగే గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోకి నీరు ఉబుకుతుండడంతో నేటికీ 12.44 టీఎంసీలకు మించి నీటిని నిల్వ ఉంచడం లేదు.

అవుకు రిజర్వాయర్‌లో మాత్రం పూర్తి స్థాయిలో నిల్వ ఉంచుతున్నారు.

మిగతా 6లో


బనగానపల్లెలో పారుతున్న ఎస్సార్బీసీ కాలువ

కరాటేలో దిట్ట.. రిదా రేష్మీ..

● అంతర్జాతీయ స్థాయిలో రజతం ● జాతీయ స్థాయిలో బంగారు పతకం



మెడల్స్‌తో రేష్మీ





మద్దికెర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్దికెరలోని కరాటేలో దిట్ట రిదా రేష్మీ అంతర్జాతీయ స్థాయిలో రజిత పతకం సాధించింది.. జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించడంతో పాటు ప్రశంసా పత్రాలు అందుకుని పలువురి చేత శభాష్ అనిపించుకుంది. గ్రామానికి చెందిన రషీద్, రేష్మా జైబూన్ దంపతుల ఒక్కగానొక్క కూతురు రిదా రేష్మీ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. అయితే.. ఆరేళ్ల వయస్సు నుంచే కరాటే మీద దృష్టి సారించింది. హైదరాబాదులో కోచ్ శివారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతోంది. జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించడమే కాకుండా జాతీయ స్థాయిలో కరాటేలో ప్రతిభ కనబరుస్తూ వచ్చింది. ఈ ఏడాది గోవాలో అంతర్జాతీయ స్థాయిలో ఈ ఏడాది సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరిగిన కరాటే పోటీల్లో మలేషియాతో పోటీ పడి రజిత పతకాన్ని సాధించింది. అలాగే ఈ ఏడాది సెప్టెంబరు 28, 29 తేదీల్లో బెంగుళూరులో జరిగిన సబ్ జూనియర్ కేటగిరీల్లో అంతర్జాతీయ స్థాయిలో కరాటే పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకాన్ని సాధించింది. రిదా రేష్మీ ఏడేళ్ల వయస్సులోనే వైట్ బెల్ట్, ఎల్లో బెల్ట్, బ్లూబెల్ట్, గ్రీన్ బెల్ట్, రెడ్ బెల్ట్ నుంచి బ్లాక్‌బెల్ట్‌కు చేరుకుంది. ఈ ఏడాది డిసెంబరు ఆఖరులో జరిగే కరాటే పోటీల్లో తన సత్తా చాటేందుకు శిక్షణ పొందుతున్నదని ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

దేశానికి పేరు తీసుకువస్తా

మా అమ్మ నాన్న, గురువు ప్రోత్సాహంతో కరాటేలో మరింతగా రాణిస్తా. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు కరాటే నేర్చుకుంటున్నా. డిసెంబరు ఆఖరులో బెంగళూరు లేదా గోవాలో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ పొందుతున్నాను.

– రిదా రేష్మీ, కరాటే, బ్లాక్‌బెల్ట్, మద్దికెర



పోటీల్లో పాల్గొన్న రిదా రేష్మీ

డిగ్రీ పరీక్షల్లో 13 మంది డిబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధ వారం జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో మొదటి సెమిస్టర్‌లో 10,135 మందికి 8,875, 5వ సెమిస్టర్‌లో 4,424 మందికి గానూ 3,935 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

సీఎం సదస్సుకు ఎస్పీ బిందుమాధవ్



కర్నూలు క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం నిర్వహించేఎస్పీల సదస్సుకు ఎస్పీ బిందుమాధవ్ విజయవాడకు వెళ్లారు. ఎస్పీలతో ముఖ్యమంత్రి శాంతిభద్రతలపై చర్చించనున్నారు. జిల్లాలో సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటికి కట్టడికి తీసుకోవాల్సిన చర్యలు పలు అంశాలపై ఎస్పీ ఈ సదస్సులో చర్చించనున్నారు.

శాశ్వత అన్నప్రసాద వితరణకు విరాళం



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో స్వాములు

శ్రీశైలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన అవుతపల్లి శ్రీనివాసరావు అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,01,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

పీవోడీటీటీగా డాక్టర్ సుదర్శన్‌బాబు



నియామక పత్రాన్ని అందిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖ కర్నూలు పీవోడీటీటీగా డా.సి. సుదర్శన్‌బాబు నియమితులయ్యారు. కృష్ణా జిల్లా గుడివాడ పీపీ యూనిట్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్న డా.సి. సుదర్శన్‌బాబుకు ఈ నెల 4వ తేదీ విజయవాడలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా. పద్మావతి కౌన్సెలింగ్ నిర్వహించారు. డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి ఇచ్చి నంద్యాల జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారితోపాటు కర్నూలు పీవోడీటీటీగా నియమిస్తూ పోస్టింగ్ వేశారు. ఈ మేరకు బుధవారం కర్నూలు డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ సమక్షంలో పీవోడీటీటీగా బాధ్యతలు చేపట్టారు.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ బాలప్రకాష్ రావు

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన డా.బాలప్రకాష్‌రావు కర్నూలు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నియమితులయ్యారు. ఈ మేరకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది ద్వారక తిరుమల నుంచి కర్నూలు డీఐవోగా రానున్నారు.

కంది సాగు వివరాలు నమోదు చేసుకోండి

నంద్యాల రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంది పంట సాగు చేస్తున్న రైతులు సమీపంలోని రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ కోరారు. బుధవారం ఆయన కార్యాలయంలో కంది కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా గుర్తించి ఖరీఫ్ 2024 లోని కంది పంటను ప్రభుత్వం నాఫెడ్ ఆధ్వర్యంలో మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 51,099 మంది రైతులు 43,000 హెక్టార్లలో పంట నమోదు చేసుకున్నారని, 54,725 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చునని అంచనా వేశామని తెలిపారు.

ఎల్‌పీఎం గుదిబండ..!

(5వ పేజీ తరువాయి)



వివిధ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 75 నుంచి 200కు పైగా ఎల్‌పీఎం నంబర్ల సమస్య వల్ల రిజిస్ట్రేషన్లు ఆగిపోయినట్లు తెలుస్తోంది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ.. వంటి ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రీ సర్వే గ్రామాల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సుమారుగా 2,500కు పైగా డాక్యుమెంట్లు ఎల్‌పీఎం నంబర్ల సమస్యతో రిజిస్ట్రేషన్ పెండింగులో ఉంటాయని ఓ అధికారి తెలిపారు. ఇంతకంటే ఎక్కువగా కూడా ఉండవచ్చని అంటున్నారు. కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఒక్కటే 150కి పైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తున్నది. ఒక్కో డాక్యుమెంట్ ద్వారా స్టాంప్ డ్యూటీ రూపంలో సగటున రూ.20-25 వేలు వరకు రావచ్చని సబ్ రిజిస్ట్రార్ ఒకరు తెలిపారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న భూములకు ఎక్కువ మొత్తంలో వస్తుందని అంటున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో దాదాపుగా రూ.55 కోట్లకు పైగా స్టాంప్ డ్యూటీ రూపంలో ఖజానాకు రావాల్సిన రాబడికి కోత పడినట్లైంది.

ఒకే ఎల్‌పీఎంతో ఎన్నో కష్టాలు

పక్కపక్కనే భూములున్న రైతులకు, వివిధ ప్రాంతాల్లో ఉన్న భూములకు అన్నింటికీ ఒకే ఎల్‌పీఎం నంబరు ఇవ్వడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదా: కల్లూరు మండలంలోని ఓ గ్రామం రైతుకు హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారి వెంబడి ఓ సర్వే నంబరులో కొంత భూమి, అదే గ్రామంలో మరో రెండు మూడు చోట్ల భూములు ఉన్నాయని అనుకుందాం. రీసర్వేకు ముందు ఒక్కో భూమికి ఒక్కో సర్వే నంబరు, ఖాతా నంబరు ఉండేది. రీసర్వే తరువాత అన్ని సర్వే నంబర్లలోని భూములకు ఒకే ఎల్‌పీఎం నంబరు ఇచ్చారు. సహజంగా జాతీయ రహదారి పక్కనే ఉన్న భూమికి రిజిస్ట్రేషన్ విలువ ఎక్కువగా, గ్రామానికి దూరంగా ఉన్న భూమి రిజిస్ట్రేషన్ తక్కువగా ఉంటుంది. ఒకే ఎల్‌పీఎం నంబరు ఇవ్వడంతో ఆ మొత్తం భూమికి ఒకే రిజిస్ట్రేషన్ విలువ సహా మొత్తం భూమిని సెలెక్ట్ చేస్తుంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. దీని వల్ల భవిష్యత్తులో భూ సమస్యలతో పాటు న్యాయ సమస్యలు తలెత్తుతాయని, క్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కర్నూలుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

జాయింట్ ఎల్పీఎం నంబర్ల వల్ల రిజిస్ట్రేషన్లలో సాంకేతిక సమస్యలు ఉన్నమాట మాట నిజమే. ఐదారుగు రైతులకు ఒకే ఎల్పీఎం నంబరు ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ సమయంలో మొత్తం భూమి విస్తీరణం సెలెక్ట్ చేస్తుంది. దీంతో సమస్యలు తలెత్తున్నాయి. సామాన్య రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించాం. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సర్వే అండ్ సెటిల్మెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా పరిష్కరించాల్సి సమస్య ఉంది. ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకెళ్తాం. త్వరంలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

– పీజీఎస్ కళ్యాణి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, కర్నూలు

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా..!

గత జగన్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసింది. రీసర్వే సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని రైతులు ఆశించారు. అయితే.. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలుదీరి ఆరు నెలలు దాటినా కూడా ఇప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2.0 ప్రైమ్‌కార్డు వర్షన్ రూపంలో ఎల్‌టీఎం నంబర్లు ద్వారానే రిజిస్ట్రేషన్ చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు తప్పడం లేదు. ఎల్పీఎం నంబర్లు కాకుండా పాత విధానం సర్వే నంబర్లు ద్వారానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టాలని, దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని మెజార్టీ రైతులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో రీసర్వే చేసిన గ్రామాల్లో దాదాపుగా 1.50 లక్షలకు పైగా జాయింట్ ఎల్పీఎం నంబర్లు వల్ల అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. రెవిన్యూ సదస్సుల్లో మెజార్టీగా ఈ సమస్యలే అధికంగా వస్తున్నాయి.

724 అర్జీలు స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 26 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 724 అర్జీలు స్వీకరించామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ తెలియజేశారు. బుధవారం ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు మండలం కడమెట్ల గ్రామంలో 186, గోనెగండ్ల మండలం గోనెగండ్లలో 34, నందవరం మండలం ముగతిలో 32, కోసిగి మండలం చిర్తనకల్‌లో 21, మంత్రాలయం మండలం బసలదొడ్డిలో 14, ఆదోని మండలం పెద్దతుంబలంలో 26, ఇస్వి గ్రామంలో 15, హొళగుంద మండలం నెరనిలో 12, కౌతాళం మండలం గుడికంబాలిలో 11, మరాలిలో 7, ఓర్వకల్లు మండలం హుడిచెర్లలో 18, కల్లూరు మండలం యాపర్లపాడులో 21, వెల్దుర్తి మండలం వెల్దుర్తిలో 53, కోడుమూరు మండలం లద్దగిరి గ్రామంలో 78, కర్నూలు రూరల్ మండలం ఈ-తాండ్రపాడు గ్రామంలో 12, గూడూరు మండలం నాగులాపురంలో 13, సి.బెళగల్ మండలం కొత్తకోటలో 6, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో తుగ్గలి మండలం చెన్నంపల్లిలో 12, క్రిష్ణగిరి మండలం ఎరుకులచెరువు గ్రామంలో 12, ఆలూరు మండలం హత్తిబెళగల్‌లో 39, చిప్పగిరి మండలం బెల్డోనలో 34, ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో 14, హాలహర్వి మండలం విరుపాపురంలో 9, గోలగోట గ్రామంలో 6, కుర్లెహళ్లిలో 23, దేవనకొండ మండలం కప్పట్రాళ్లలో 6 అర్జీలు వచ్చాయన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో మూడో స్థానం

● కలెక్టర్ రంజిత్‌బాషాను అభినందించిన సీఎం చంద్రబాబు


● ఉద్యానవనం పంటలపై దృష్టి సారించాలి

● బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

● చంద్రబాబు ఆదేశాలు



సమావేశంలో పాల్గొన్నకలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

కర్నూలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. కలెక్టరు పి. రంజిత్‌బాషాను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. అమరావతిలోని సచివాలయంలో రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సదస్సు బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు వ్యవసాయం, ఉద్యావనం, పశుసంవర్ధక శాఖ, పౌరసరఫరాలు, మత్స్య శాఖ, అటవి శాఖలతో పాటు వివిధ శాఖల్లో జిల్లా సాధించిన పురోగతి, చేపట్టాల్సిన ప్రగతి పనులపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. అదే క్రమంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రతి నెల దాదాపుగా 2,500 నుంచి 3 వేలకు పైగా వివిధ సమస్యలతో కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తే.. కొన్నింటికి వారం పది రోజుల్లోగా పరిష్కారం చూపుతున్నారు. వచ్చే అర్జీల్లో 55-60 శాతం రెవిన్యూ, భూ సమస్యలే ఉంటున్నాయి. వచ్చిన వివిధ ఫిర్యాదులు పరిష్కారంలో గ్రీవెన్స్ రోజే పరిష్కరించినవి 7.23 శాతం, ఎస్ఎల్ఏ స్కోర్‌తో సమస్య పరిష్కారం 19.38 శాతం, గడువులోగా పరిష్కారం 16.72 శాతం, కీలకమైన ఫిర్యాదులు తక్షణ పరిష్కారం 19 శాతం, గడువులో పరిష్కరించినవి 10.42 శాతం. వీటి పరిష్కారంలో జిల్లా పనితీరు 72.77 శాతంతో మూడో స్థానంలో నిలిచింది.

పేదల బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టండి

పేదలకు ఇస్తున్న రాయితీ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా సారించాలని కలెక్టర్లకు చంద్రబాబు ప్రత్యేకంగా సూచించారు. ఉద్యానవన పంట సాగును ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో 15 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగు లక్ష్యంగా కాగా.. 15,863 హెకార్టర్లు రిజిస్ట్రేషన్ చేశారు. 7,018 హెక్టార్లు ప్రాథమికంగా గుర్తించారు. 1,754 హెక్టార్లకు మాత్రమే పరిపాలన అనుమతులు ఇచ్చారు. జిల్లా 47 శాతంతో 5వ స్థానంలో ఉంది. పశుసంవర్ధక శాఖ సంబంధించి జిల్లాలో 610 గ్రామాలు, 4,73,516 ఇళ్ల ఉంటే.. 230 గ్రామాల్లో 1,81,821 ఇళ్ల సర్వే పూర్తి చేసి 38.40 శాతంతో 6వ స్థానంలో నిలిచింది. పచ్చదనం సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 351.27 చదరపు కిలోమీటర్లలో అడవులు ఉన్నాయి. అందులో 187.64 చదరపు కిలోమీటర్లలో పచ్చదనం ఉంది. జిల్లా భూవిస్తీర్ణంలో 6.75 శాతం మాత్రమే. ఈ విషయంలో జిల్లా 24వ స్థానంతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఇలా వివిధ శాఖల పురోగతిపై జిల్లా వారిగా సీఎం చంద్రబాబు సమీక్షించమే కాకుండా దిశానిర్దేశం చేశారు. పచ్చదనం కోసం (గ్రీన్ కవర్) రోడ్లు, కాలువ గట్లు, రైల్వే లైన్, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పురపాలక, పంచాయతీల్లో ఖాళీ స్థలాలు గుర్తించి పచ్చదనం పెంపొందించాలని కలెక్టర్లకు సూచించారు.

చెంతనే నీరు.. అందని తీరు..!

(5వ పేజీ తరువాయి)

ఎస్సార్బీసీ ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, పంట కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో చెంతనే నీరు ఉన్నా ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి ఎస్సార్బీసీ కాలువ ప్రారంభం అవుతుంది. పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు ఎస్సార్బీసీ కాలువల నిర్వహణ కొట్టొచ్చి కనబడుతోంది. పోతిరెడ్డిపాడు నుంచి ఎస్సార్బీసీ కాలువ ప్రారంభమవుతుంది. ఎస్సార్బీసీ కాల్వ మొత్తం దూరం 116 కిలో మీటర్లు ఉంది. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి మాత్రం పాణ్యం మండలం నుంచి ఆయకట్టుకు నీరు అందుతోంది. 1,53,936 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉంది. కాని కాల్వల మరమ్మతులు లేకపోవడంతో 42 వేల ఎకరాలకు నేటికీ సాగు నీరందడం లేదు. గోరుకల్లు నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 57.7 కిలో మీటర్ల మేర మెయిన్ కెనాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వలు దెబ్బతినడంతో ఎస్సార్బీసీ మెయిన్ కెనాల్ అవుకు మండలం మెట్టుపల్లె వద్ద రెండు సార్లు, బనగానపల్లె మండలం వెంకటాపురం వద్ద రెండు సార్లు, అలాగే బనగానపల్లె పట్టణం సమీపంలో ఒకసారి ప్రధాన కాల్వలకు గండి పడ్డాయి. అనేక చిన్నచిన్న గండ్లు పడ్డాయి. గండ్లు పడుతుండడంతో నీరు పూర్తిగా వృథాగా పోతోంది. గతంలో బనగానపల్లె పట్టణం సమీపంలోని ప్రధాన కాలువ దెబ్బతినడంతో ఏకంగా బనగానపల్లె పట్టణంలోకి ఎస్సార్బీసీ నీరు ప్రవహించింది. అలాగే పంటలు కూడా దెబ్బతిన్నాయి. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 57.7 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ వెంబడి వేసిన సిమెంట్ లైనింగ్ పూర్తిగా దెబ్బతింది. కొన్ని చోట్ల ప్రధాన కాలువలో సిమెంట్ లైనింగ్ స్థానంలో పిచ్చిమొక్కలు మొలిశాయి. ఎస్సార్బీసీ ప్రధాన కాలువ నుంచి వచ్చే డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ చానళ్ల ద్వారా పంటల సాగుకు నీరందించాల్సి ఉంది.



ఎస్సార్బీసీ కెనాల్

చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు

ఎస్సార్బీసీ ఆయకట్టు మొత్తం 1.53 లక్షల ఎకరాలకుగాను 1.11 లక్షల ఎకరాలకు మాత్రమే పంట కాలువలు ఉన్నాయి. 2000లో పంట కాలువలు తవ్వారు. అప్పట్నుంచి ఇప్పటి వరకు పంట కాలువలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందక పంటలు పండించుకోలేకపోతున్నారు. 70 శాతం మాత్రమే పంట కాలువలు పూర్తయ్యాయి. బనగానపల్లె మండలంలో 20 వేలకు పైగా ఎకరాలకు సాగు నీరు, మిగతా అవుకు, సంజామల, కోవెలకుంట్ల, మండలాల్లో 22 వేల ఎకరాలకు నేటికీ సాగునీరు అందడం లేదు. పంట కాలువల నిర్మాణం పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణం. దీనికి తోడు ఎస్సార్బీసీ డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడిక చేరి కంపచెట్లు మొలిచి లైనింగ్ దెబ్బతింది. కాలువల పొడవునా, కట్టలపై కంప చెట్లు మొలిచి దారి కూడా కనబడని పరిస్థితులు ఉన్నాయి. వీటి మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారు గానీ నిధులు మంజూరు కావడం లేదు. పంట కాలువలు పూర్తి కాకపోవడంతో 20 సంవత్సరాల నుంచి చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. దీంతో చెంతనే నీరున్నా రైతులు పంటలు పండించలేని దుస్థితి ఏర్పడింది.

ప్రతి సమస్య పరిష్కారం కావాల్సిందే

కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు





పాల్గొన్న మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్నకలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే ప్రతి సమస్య పరిష్కారం కావాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు, 26 జిల్లాలకు చెందిన కలెక్టర్లతో రెండో జిల్లాల కలెక్టర్ల సమావేశం ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత ఆరు నెలల పాలనపైన, భవిష్యత్తు ప్రణాళికలపైనా చర్చించారు. పీజీఆర్ఎస్‌పై కలెక్టర్ల సదస్సులో అధికారుల ఇచ్చిన ప్రజెంటేషన్‌పై ముఖ్యమంత్రి స్పందిస్తూ అధికారులు, కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు ముఖ్యమని వారి సమస్యలు వంద శాతం పరిష్కరించాలని, అలాగే ప్రజాప్రతినిధులు తెచ్చిన సమస్యలకు ప్రాధాన్యమివ్వాలని సీఎం చెప్పారు. ప్రతి సమస్యను మానవీయ కోణంలో చూసి పరిష్కరించాలన్నారు. తమది పొలిటికల్ గవర్నెన్స్ అని సీఎం స్పష్టం చేశారు. ప్రజలు ఎన్నో ఆకాంక్షలు, ఆశలతో తమను గెలిపించారని, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలు తీసుకొని వచ్చినప్పుడు వారిని గౌరవించి, వారు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి

- సాగు నీటి సంఘాల ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కలెక్టర్
- 14న నీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు..
- గ్రామాల్లో నోటిఫికేషన్ పబ్లిష్ చేసిన అధికారులు
- జిల్లాలో 123 సాగునీటి సంఘాల్లో 1,212 టీసీ సభ్యులకు ఎన్నిక
- పల్లెసీమల్లో సత్తా చాటేందుకు సిద్ధం అంటున్న రాజకీయ పార్టీలు
- ఏకగ్రీవం దిశగా అధికార టీడీపీ కూటమి వ్యూహ రచన



ఆస్పరి మండలం ముతుకూరులో నోటిఫికేషన్ పబ్లిష్ చేస్తున్న ఏఈఈ మల్లికార్జున

కర్నూలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు ముచ్చటగా మూడోసారి కలెక్టరు పి. రంజిత్‌బాషా బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలో 123 సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏ), 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు నూతన పాలకవర్గం ఎన్నికకు కలెక్టర్ షెడ్యూల్, అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగే గ్రామాల్లో డబ్ల్యూయూఏ ఆథరైజ్డ్ అధికారులు గ్రామస్తుల సమక్షంలో నోటిఫికేషన్ పబ్లిష్ చేసి నోటీస్ బోర్డులో అతికించారు. రాష్ట్ర విభజన తరువాత ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వం 2015లో రాష్ట్రంలో సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుల ఎంపికకు ఎన్నికలు నిర్వహించారు. వారి ఆధ్వర్యంలో కాలువలు, ప్రాజెక్టులు నిర్వహణ, మరమ్మతులు చేపట్టారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు ఈ కమిటీలు ఎంతోగానో దోహదం చేశాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2022లో సాగునీటి ఎన్నికలను రద్దు చేశారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే తొమ్మిదేళ్ల తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అక్టోబరు 9న రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించగా.. అదే నెల 21న కలెక్టరు రంజిత్‌బాషా నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం నవంబరు 29న ఎన్నికల ప్రక్రియ ముగియాల్సి ఉండేది. అయితే.. అసెంబ్లీ సమావేశాల కారణంగా వాయిదా వేశారు. తర్వాత ఫెంగల్ తుఫాన్ కారణంగా మరోసారి వాయిదా పడ్డాయి. 14వ తేది నుంచి నీటి సంఘాల ఎన్నికలు జరుపుతామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 3న ప్రకటించారు. అందులో భాగంగానే బుధవారం కలెక్టరు రంజిత్‌బాషా నోటిఫికేషన్ జారీ చేశారు.

14న నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్	
టీసీ సభ్యుల నామినేషన్ల స్వీకరణ	: ఉదయం 9.45 నుంచి 10.15 గంటల వరకు
పరిశీలన	: 10.15 నుంచి 10.30 గంటల వరకు
ఎన్నికల ప్రక్రియ	: 10.30 నుంచి 12.30 గంటల వరకు
ఓటింగ్ స్లిప్పుల లెక్కింపు	: మధ్యాహ్నం 1.00 గంటకు
అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక	: 3.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు
డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక	: 17న సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కమిటీ ఎన్నిక

ఎన్నికల సిబ్బంది వివరాలు	
డబ్ల్యూయూఏ ఆథరైజ్డ్ అధికారులు	: 123
టీసీ ఎన్నికల సహాయకులు	: 1,212
రిజర్వుడ్ సిబ్బంది (20 శాతం)	: 250
ఓటు హక్కు ఉన్న రైతులు	: 1,32,112
డబ్ల్యూయూఏ ఆయకట్టు(ఎకరాలు)	: 2,20,498.94

14న 1,212 టీసీ సభ్యులకు.. 17న డీసీ కమిటీ ఎన్నికలు

కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాలలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా ప్రాజెక్టు సహా మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో 123 సాగునీటి వినియోగదారుల సంఘాలలో 1,212 ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ) సభ్యుల ఎన్నికకు 14న షెడ్యూల్ ఇచ్చారు. టీసీ సభ్యులు ఎన్నికైన తరువాత సాయంత్రం సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 17వ తేదిన హొళగుంద, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు-డీసీ-5, డీసీ-6, గోనెగండ్ల, కోడుమూరు, కర్నూలు డీసీ-9, డీసీ-10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను సర్వసభ్య సమావేశం నిర్వహించి ఎన్నిక చేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు సమావేశమై తుంగభద్ర దిగువ కాలువ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే.. ప్రాజెక్టు కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు.

సాగు నీటి సంఘాల వివరాలు	
ప్రాజెక్టు	సంఘాలు
కేసీ కెనాల్	2
తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ	58
ఆలూరు బ్రాంచి కెనాల్	6
హంద్రీనీవా కాలువ	3
గాజులదిన్నె ప్రాజెక్టు	12
రాంపురం చానల్ కెనాల్	1
మైనర్ ఇరిగేషన్ చెరువులు	41
మొత్తం	123

పల్లెసీమల్లో వేడి పుట్టించిన నీటి సంఘాల ఎన్నికలు:

సాగునీటి సంఘాల ఎన్నికలు పల్లెసీమల్లో రాజకీయ వేడి రాజేసింది. అధికార టీడీపీ కూటమి పార్టీలు ఈ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవడానికి రాజకీయ ఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు ఆయా గ్రామాల నాయకులతో చర్చించి నీటి సంఘాల్లో టీసీ సభ్యులుగా ఎవరు పోటీ చేయాలో, ఆ తరువాత అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎవరిని ఎన్నుకోవాలో దాదాపుగా ఖరారు చేశారు. ఆదోనిలో బీజేపీ ఎమ్మెల్యే ఉండడంతో అక్కడ అభ్యర్థుల ఎన్నిక ఇంకా ఓ కొలిక్కి రాలేదని తెలుస్తుంది. మిగిలిన నియోజకవర్గాల్లో బీజేపీ, జనసేన నాయకులు కూడా తమకు నీటి సంఘాల ఎన్నికల్లో దమాషా ప్రకారం నీటి సంఘాల అధ్యక్ష పదవులు కేటాయించాలని కోరుతున్నారు. ఏ నియోజకవర్గంలో కూడా ఈ ఎన్నికలపై మూడు పార్టీలు కూర్చొని చర్చించలేదని, టీడీపీ ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజవకర్గం ఇన్‌చార్జిలు తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని, బీజేపీ, జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని తమ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని ఆ పార్టీల జిల్లా నాయకులు పేర్కొనడం కొసమెరుపు.

14న టీసీలకు ఎన్నికలు



రుద్రవరం వద్ద తెలుగు గంగ కాలువ

నంద్యాల జిల్లా సాగు నీటి సంఘాల వివరాలు				
ప్రాజెక్టు	డబ్లుయూఏ	డీసీ	పీసీ	ఆయకట్టు
కేసీ కెనాల్	52	9	1	162854
ఎస్సార్బీసీ	50	8	1	153034
తెలుగుగంగ	47	8	1	129412
శివభాష్యం	7	0	1	12092
మైనర్ ఇరిగేషన్	104	0	0	40056
మైలవరం	1	0	0	740
మొత్తం	261	25	4	498190

- 17న డీసీ ఎన్నికలు
- జిల్లా వ్యాప్తంగా 261 సాగు నీటి సంఘాలు

నంద్యాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 14 టీసీ (టెరిటోరియల్ కానిస్టిట్యుయెన్సీ మెంబర్స్)లకు, అదే రోజు మేజర్, మీడియం ప్రాజెక్టు కమిటీ ఎన్నికను కూడా పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఈ నెల 17వ తేదీన డీసీలకు ఎన్నికలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికలకు ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఎన్నికలు జరిగితే ఆయకట్టు పంట కాలువలు బాగుపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారులు సంసిద్ధం..

ఎస్సార్బీసీ, తెలుగు గంగ, కేసీ కెనాల్ ద్వారా నంద్యాల జిల్లాలోని దాదాపు 45,98,190 ఎకరాల ఆయకట్టు ఉంది. రాయలసీమ జిల్లాలోని మిగతా జిల్లాలతో పోలిస్తే ఈ స్థాయిలో కాలువల కింద ఆయకట్టు ఉండటం గొప్ప విషయమే! దీంతో ఇక్కడ రైతులు దాదాపు 3 లక్షలకు పై చిలుకు సంఖ్యలో ఉన్నారు. భూ యాజమాన్య హక్కు ఉన్న వారికే ఓటు హక్కు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 261 సాగునీటి సంఘాలు ఉండగా, 2487 టీసీ (ప్రాదేశిక నియోజకవర్గం)లు ఉన్నాయి. ఈ టీసీ సభ్యులు డబ్ల్యూయూఏ (సాగునీటి సంఘాలు) ప్రెసిడెంట్లను, వైస్ ప్రెసిడెంట్లను ఎన్నుకుంటారు. ఆ తర్వాత డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు ఉంటాయి. ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని సాగునీటి సంఘాలకు ఎన్నికల అధికారిని ఇప్పటికే నియమించారు.

ఆర్‌యూలో ఉద్రిక్తత..

- ఉద్యోగుల మధ్య చిచ్చు రేపిన అంతర్గత బదిలీ

కర్నూలు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఉద్యోగుల మధ్య బదిలీల చిచ్చు ఉద్రిక్తతకు దారి తీసింది. వర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి ఎటువంటి ఉత్తర్వులు లేకుండా అడ్డగోలుగా బదిలీలు చేపట్టారని ఉద్యోగుల ఆరోపణ. ఆరుగురిని తనకు అనుకూలమైన విభాగాలకు బదిలీ చేశారంటూ కొందరు ఉద్యోగులు మండిపడుతున్నారు. తమను కూడా బదిలీ చేయాలని రిజిస్ట్రార్ చాంబర్ వద్దకు చేరుకుని ఉద్యోగులు తమ నిరసన తెలిపారు. స్పందించిన రిజిస్ట్రార్ ఉపకులపతిని సంప్రదించాలని సూచించినట్లు సమాచారం.

49 బన్నూరులో ప్రజాభిప్రాయ సేకరణ

మిడుతూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 49 బన్నూరు గ్రామంలో మైనింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ గ్రామానికి చెందిన 384 సర్వే నెంబ రులో 55 ఎకరాల్లో ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సమక్షంలో మెస్సర్స్ శిరిడీసాయి లిమి టెడ్ సిలికా శ్యాండ్ క్వార్టజైట్ గని వారు మైనింగ్ కోసం 2006 సంవత్సరంలో దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ విషయంపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ జేసీ విష్ణుచరన్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. మైనింగ్ కంపెనీ గ్రామ సమీపంలో ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు ఏర్పడతాయని కొంత మంది ప్రజలు వ్యతిరేకత తెలిపారు. మరికొంత మంది ప్రజలు మైనింగ్ వారు గ్రామం అభివృద్ధికి సహకరించి గ్రామంలో రోడ్లు, తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మైనింగ్ ప్రదేశాన్ని జేసీ పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో జేసీ

తెలంగాణలో వలస కూలీ మృతి

కోసిగి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు గ్రామానికి చెందిన ఈడిగ గిడ్డయ్య (29) తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. భార్యా పిల్లలతో కలిసి వలస వెళ్లిన గిడ్డయ్య మంగళవారం తెలంగాణ రాష్ట్రంలోని మక్తల్ దగ్గర రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం మృతుని స్వగ్రామమైన పల్లెపాడులో అంత్యక్రియలు నిర్వహించారు. పల్లెపాడులో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతునికి భార్య, అనురేఖ, అశ్విక కూతుళ్లు, కొడుకు యువరాజు ఉన్నారు.



గిడ్డయ్య (ఫైల్)

మహిళా కూలీ మృతి

డోన్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలం ధర్మవరం గ్రామానికి చెందిన మహిళా కూలీ లోకేశ్వరమ్మ (45) ప్రమాదవశాత్తు బుధవారం సాయంత్రం మృతి చెందింది. డోన్ మండలం కోట్లవారిపల్లె గ్రామ ప్రధాన రోడ్డులో ఉన్న వల్వలేజర్ ఫౌడర్ ఫ్యాక్టరీలో లోకేశ్వరమ్మ రోజు వారి కూలీకి వెళ్తుండేది. బుధవారం సాయంత్రం ఫ్యాక్టరీలోని కంకరలో ప్రమాదవశాత్తు పడి ఇరుక్కుని మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి భర్త చిన్న మద్దయ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మహిళా కూలీ మృతి చెందడంతో ధర్మవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జరిగిన సంఘటనపై డోన్ రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.



లోకేశ్వరి (ఫైల్)

విజయ డెయిరీ ఛైర్మన్‌పై కేసు నమోదు

రుద్రవరం, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): నంద్యాల విజయ పాల డెయిరీ ఛైర్మన్ ఎస్.వి. జగన్‌మోహన్‌రెడ్డి పై ఈనెల 7వ తేదీన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని మాజినేనిపల్లె గ్రామానికి చెందిన రమేష్ గౌడ్ ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. మాచినేనిపల్లె మిల్క్ సొసైటీ అధ్యక్షుడైన ఎస్.వి. జగన్‌మోహన్‌రెడ్డి ఆళ్లగడ్డ పట్టణంలోని పాతూరి వీధిలో శాశ్వత నివాసం ఏర్పరుచుకున్నాడని, కానీ రుద్రవరం మండలంలోని మాచినేనిపల్లె గ్రామంలో ఉంటున్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చి పాల సేకరణ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడని రమేష్ గౌడ్ తెలిపారని ఎస్ఐ అన్నారు.

కర్నూలులో సినీ తారల సందడి





చీరలను పరిశీలిస్తున్న సినీ తారలు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి.. అభిమానులతో సెల్ఫీ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో సినీ తారలు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి సందడి చేశారు. ప్రముఖ వ్యాపార సంస్థ సీఎంఆర్ తన 40వ షాపింగ్ మాల్‌ను కర్నూలులో బుధవారం ప్రారంభించిన సందర్భంగా ఈ కార్యక్రమానికి వారు విచ్చేశారు. ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలులోని పార్క్ రోడ్డులో ఏర్పాటు చేసిన సి.ఎం.ఆర్ షాపింగ్ మాల్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే స్టోరులోని అన్ని రకాల వస్త్రాలను పరిశీలించారు. అందరూ మెచ్చే అన్ని రకాల డిజైన్లు చాలా తక్కువ ధరలకే లభిస్తున్నాయని నిర్వాహకులను అభినందించారు. కర్నూలులో సి.ఎం.ఆర్ లాంటి పెద్ద మాల్స్ రావడం వల్ల మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా సి.ఎం.ఆర్ ఛైర్మన్ వెంకటరమణకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథులుగా కోడుమూరు నియోజకజవర్గం టీడీపీ ఇన్‌చార్జి డి. విష్ణువర్ధన్‌రెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సి.ఎం.ఆర్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత 4 దశాబ్దాలుగా ఏపీ, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని, తమ 40వ షోరూమ్‌ను కర్నూలులో ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. సి.ఎం.ఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ ఫ్యామిలీ అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్లు లభిస్తాయన్నారు. తమ వద్ద అందరికీ అందుబాటు ధరల్లో లక్షలలో డిజైన్లు, వేలల్లో వెరైటీలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ తారలు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం అన్ని సెక్షన్లు తిరిగి అన్ని రకాల వస్త్రాలను పరిశీలించారు. షాపింగ్ మాల్‌లో అన్ని రకాల వస్త్రాలు, వాటి క్వాలిటీ చాలా బాగుందని, రిజనల్ ప్రైస్‌లో లభిస్తు న్నాయని చెప్పారు. షాపింగ్ మాల్‌లో అభిమానులు, వినియోగదారులతో సెల్ఫీలు దిగుతూ, తమ నృత్యాలతో సందడి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మద్దికెర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఓ వాహనం, బైకు ఢీకొని పారా హర్ష, అభి అనే యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. బుధవారం గుంతకల్లు నుంచి మద్దికెరకు వస్తున్న వాహనం, మద్దికెర నుంచి గుంతకల్లుకు వెళ్తున్న బైకు ఢీకొన్నాయి. అభి అనే యువకుడి చెయ్యి విరుగగా, హర్ష అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని గుంతకల్లు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. ఒకరిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఎస్ఐ విజయ కుమార్ నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు

14న జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ కబడ్డీ బాలుర, బాలికల ఎంపిక పోటీలు ఈ నెల 14వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు ప్రథమ నందీశ్వర ఆలయం చామకాలువ దగ్గర నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ ఏపీ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే వారు 1.1.2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు ఉండాలన్నారు. క్రీడాకారులు వచ్చేటప్పుడు ఆధార్, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్ తీసుకుని రావాలన్నారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారనీ తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు నిమ్మకాయల సుధాకర్, షేక్ మున్నాబాషా, దండే నాగరాజు, సుబ్రహ్మణ్యం, శివలింగమయ్య, సురేష్ నాయుడు, మారెళ్ల నాగరాజు, భరత్ రెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడి మృతి

బనగానపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణ సమీపంలోని నంద్యాల రహదారిలో రౌండ్స్ సర్కిల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పాణ్యం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ బాషా(35) తోటి కార్మికులతో కలిసి బనగానపల్లెలో పని ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో రౌండ్స్ సర్కిల్ వద్ద రోడ్డు పక్కన సేద తీరుతున్నాడు. అప్పటికే పక్కనే నిలబడి ఉన్న ఆటో డ్రైవర్ షేక్ హుస్సేన్ బాషాను గమనించకుండా ఆటో ముందుకు కదిలించాడు. దీంతో నిద్రిస్తున్న హుస్సేన్ బాషా పైనుండి ఆటో వెళ్లడంతో మృతి చెందినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మృతి చెందిన హుస్సేన్ బాషా

ముగ్గురు దొంగల అరెస్టు

- రూ.55 వేలు, రెండు తులాల బంగారు, 15 తులాల వెండి స్వాధీనం



దొంగలను చూపుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణం ఊరిబయట సవారమ్మగుడి సమీపంలో కేజీ రోడ్డుపై ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నందికొట్కూరు ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి ముగ్గురు దొంగలను వల పన్ని పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల నగదు, 2 తులాల బంగారు గొలుసు, 15 తులాల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. పట్టుబడిన దొంగలు నీలి షికారి కమ్మూర్, నీలిషికారి నానాసింగ్, షికారి అవర్‌సింగ్, అలియాస్ అమర్ సింగ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై గతంలోనే పలు పోలీస్ స్టేషన్‌లలో దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. వారిని కోర్టు ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు పంపనున్నట్లు చెప్పారు.

అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ

జూపాడుబంగ్లా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నిశాఖల పరిధిలో గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు తయారు చేయడానికి ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 12, 13న తేదీలలో వివిధ శాఖల అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఎంపీడీవో, తహసీల్దార్, పీఆర్ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ, వెలుగు ఏపీఎం, ఐసీడీఎస్, ఎన్ఆర్ఈజీఎస్, వైద్యులు, వ్యవసాయ అధికారి మండలస్థాయి అధికారులతోపాటు, వివిధ గ్రామాల సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

ఆకతాయిల నుంచి రక్షణ కల్పించాలి



ఎస్ఐ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

జూపాడుబంగ్లా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా, హైస్కూల్, ఆదర్శ పాఠశాలలు వదిలిన సమయంలో ఆకతాయిలు విద్యార్థినులను అల్లరి చేస్తున్నారని, వారి నుంచి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఏబీవీపీ నాయకులు యుగంధర్ బుధవారం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. ఆకతాయిలు మద్యం సేవించి విద్యార్థినుల వెంట పడుతున్నారన్నారు. ప్రతిరోజూ విద్యార్థినులు భయాందోళనకు గురౌతున్నారని, పాఠశాల వదిలిన సమయంలో పోలీసుల గస్తీ ఏర్పాటు చేసి వారికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శివ, శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఏపీజీ బ్యాంకు చేయూత

పాణ్యం, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలపనూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులకు పాణ్యం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు స్కాలర్‌షిప్ నగదును అందజేశారు. బుధవారం పాఠశాలకు చెందిన 9, 8, 7 తరగతుల విద్యార్థినులు ప్రశాంతి, ప్రవళ్లిక, వైష్ణవిలకు ఒక్కొక్కరికీ రూ. ఐదు వేల నగదును విద్యార్థినుల బ్యాంకు అకౌంట్లకు జమచేశారు. బ్యాంకు మేనేజర్ సురేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈ విద్యార్థినులు చదువులో టాపర్స్‌గా నిలిచారన్నారు. నగదు మొత్తాన్ని చదువుకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు సరస్వతి, చంద్రుడు, సుధాకర్‌రెడ్డి, మాబుబాషా పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



రోళ్లపాడు గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

మిడుతూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని చింతలపల్లి మజిరా గ్రామమైన ఖాజీపేట, రోళ్లపాడు, తలముడిపి గ్రామాల్లోని కైపాసీతారామిరెడ్డి రూ. 6,01977, శంకరమ్మకు రూ.80,000, గుండం ఉషారాణికి రూ.80,000 ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు శివరామి రెడ్డి, రామస్వామి రెడ్డి, వెంటేశ్వర రెడ్డి, రవీంద్ర బాబు, షబ్బు, నరసింహగౌడు, సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గడివేముల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బిలకలగూడురు, కొరపొలూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట సాగులో విత్తన ఎంపిక కీలకమైందని అన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా ఎరువులను వాడాలని అన్నారు. మొక్కజొన్న పంట సాగు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.

క్విజ్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

గడివేముల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కౌశల్ రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల్లో మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని ధరణి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రూబినా అఫ్రిన్ తెలిపారు. రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల్లో జిల్లాస్థాయిలో రెండవ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

పామాయిల్ సాగుతో రైతుల ఆర్థిక అభివృద్ధి

కొత్తపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పామాయిల్ సాగుతో ఆర్థికంగా అభివృద్ధి మెరుగుపడుతుందని ఎంపీడీవో మేరీ అన్నారు. బుధవారం కొక్కెరంచ గ్రామ పంచాయతీలోని మజరా గ్రామ రైతులు సాగు చేసిన పామాయిల్ సాగు పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఏ రైతు అయినా పామాయిల్ సాగుకు ముందుకు వచ్చేవారు ఉంటే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కొక్కెరంచలో ముగ్గురు, ఎదురుపాడు గ్రామంలో ఐదు మంది రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారని అన్నారు. ఈ గ్రామాల్లో 20 ఎకరాల్లో సాగు జరుగుతుందన్నారు. వీటి ద్వారా రైతులు ఆర్థికంగా ఎదుగుతారనీ తెలిపారు. హార్టికల్చర్ శాఖ ద్వారా ప్రభుత్వం సబ్సిడీ ఎస్ఆర్ఈజీఎస్ కింద ఫిట్టింగ్, ప్లాంటింగ్, మెయింటెనెన్స్ ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పంటను సాగు చేసుకోవాలనుకున్న రైతులు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఈసి శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.





అద్దె భవనాల్లో సాగుతున్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు స్టేషన్, దేవదాయశాఖ కార్యాలయాలు

సొంత భవనాలు కరువు!

- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- అద్దెలను భరాయించలేక మారుమూల కాలనీల్లో కార్యాలయాల ఏర్పాటు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, ఉద్యోగులు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం



కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయం

ఆత్మకూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో చాలీచాలని అద్దె గదుల్లో విధులు నిర్వహించేందుకు సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆత్మకూరు పట్టణంలోని అక్కిరాజుకాలనీలోని మారుమూల కాలనీలోని ఓ ఇంట్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అసలు ఈ కార్యాలయాన్ని గుర్తుపట్టేందుకు తికమకపడాల్సిన పరిస్థితి నెలకొంది. నాటుసారా, బెల్ట్ ఇతర అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపే ఈ శాఖ కార్యాలయం మారుమూల కాలనీలో ఉండడం వల్ల అసలు ఆత్మకూరు ఎక్సైజ్ శాఖ ఉందన్న విషయాన్ని సైతం ప్రజలు మరచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ భవనం కూడా చాలీచాలక పోవడంతో ఎక్సైజ్ అధికారులు తిప్పలు తప్పడం లేదు. అదేవిధంగా దేవదాయశాఖ కార్యాలయం అప్పారావువీధిలోని ఓ కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని గుర్తించడం కూడా కష్టంగానే ఉంటుంది. సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయం గౌడ్‌సెంటర్‌లో మొదటి అంతస్తులో చిన్నగదిలో ఏర్పాటు చేశారు. వాస్తవానికి కార్మికులకు ఏదైనా అవగాహన కార్యక్రమాలు, ఇతర సమావేశాలను ఇక్కడ నిర్వహించలేని పరిస్థితి దాపరించింది. అదేవిధంగా ఉద్యానశాఖకు సంబంధించి సొంత కార్యాలయం లేకపోవడంతో సంబంధిత అధికారిణి అగ్రిల్యాబ్‌లోనే ఉంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. సహాయ సాంఘీక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం కూడా ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. అలాగే పట్టణంలోని అన్ని బ్యాంకుల్లో అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. దీంతో ఆయా ప్రభుత్వ కార్యాలయాలన్ని ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ప్రతి నెల వీటి బాడుగలు రూ.లక్షల వ్యయం అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలి

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న నిర్మాణ పనులకు చెందిన కాంట్రాక్టర్‌కు చెల్లించే సొమ్ములో ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించే అంశంపై సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి నిర్మాణ సంస్థ చట్టాన్ని అనుసరించి విధిగా మీసేవలోగాని, ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని సభ్యులను ఆదేశించారు. ప్రభుత్వ నిర్మాణ పనులు అమలుచేసే ప్రభుత్వ శాఖల అధికారులు, బిల్డింగ్ ప్లానులు అప్రూవల్ చేసే సంస్థలైన మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీరాజ్, ఏపీఐఐసీలకు చెందిన సంస్థలు ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కార్మికశాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్, ఉపకార్మిక కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ కార్మిక కమీషనరు బషిరున్నిసాబేగం, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం ప్రారంభం



అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి నిత్యానందస్వాములు

ఆత్మకూరురూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం వెంకటాపురం గ్రామంలో మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అన్నదానసత్రాన్ని భక్తుల సమక్షంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ముందుగా ఆలయంలో పీఠాధిపతులు నిత్యానంద భారతిస్వామి, వీరాచారిస్వామి, శివస్వామిల ఆధ్వర్యంలో మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు నిత్యానందస్వామి చేతుల మీదుగా గ్రామ కమిటి సభ్యులు అన్నదాన సత్ర శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కమిటీ పర్యవేక్షణలో 1.10 కోట్లతో దాతల సహకారంతో ఈ అన్నదాన సత్రాన్ని శ్రీశైల పాదయాత్ర భక్తుల సౌకర్యార్థం నిర్మించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా శ్రీశైలానికి పాదయాత్ర భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

పాములపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి పంటలను సాగు చేసిన రైతులు బీమా పథకానికి సంబంధించి ప్రీమియం డిసెంబర్ 15 లోగా చెల్లించాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని జూటూరు, ఇస్కాల గ్రామాల్లో వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. రైతులు పంటల బీమా పరిహారం పొందాలంటే బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. తద్వారా ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయినట్లయితే పంటల బీమా పథకం ద్వారా పరిహారం అందనుందని వివరించారు. రైతులు సాగు చేసిన మినుము, వరి,శనగ,జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు.అలాగే రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

14న నీటి సంఘాలకు ఎన్నికలు

పాములపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):పాములపాడు మండలంలోని నాలుగు నీటి సంఘాలకు డిశంబర్ 14న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గాయత్రి బుధవారం తెలిపారు. పాములపాడు మండలంలోని వేంపెంట, మద్దూరు, వాడాల, పాములపాడు నీటి సంఘాలకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.పాములపాడు నీటి సంఘం ఎన్నికల అధికారిగా ఎంపీడీవో గాయత్రి,వేంపెంటకు వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, మద్దూరుకు ఎంఈవో 2సుభాషిని, వాడాలకు తహసీల్దార్ సుభద్రమ్మలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు.ఈ మేరకు ఇప్పటికే ఈ నెల 11న నోటిఫికేషన్ జారీ అయినట్లు తెలిపారు.

ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయండి

కొత్తపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో ఎంఎస్ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో మేరీ తెలిపారు. బుధవారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 289 మంది చీరలు, మందుల షాపులు, కూల్‌డ్రింక్స్, కిరాణం తదితర వ్యాపారాలు చేసుకునే వాళ్లు ఉన్నారనీ, వారి పూర్తి వివరాలను ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే సచివాలయ సిబ్బంది ఇప్పటి వరకు 210 మంది వ్యాపారస్థుల వివరాలు పూర్తి చేశారన్నారు. మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

బాలికల భవిత అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీవో లీలావతీదేవి

బండిఆత్మకూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలికల భవిత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో లీలావతీ దేవీ, ఎంపీడీవో దస్తగిరి, కేసీబీవీ ఎస్‌వో దాక్షాయిణీ అన్నారు. బుధవారం బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై వివిధ శాఖల గ్రామస్థాయి సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం మండల సూపర్‌వైజర్ రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాటి జీవన శైలికి నేటి జీవన శైలి ఏ మాత్రం సరిరాదన్నారు. నేడు తీసుకుంటున్న ఆహారం, శ్రమ ఏ మాత్రం శారీరక దారుఢ్యానికి ఉపయోగం లేనిదన్నారు. అనంతరం పలు అంశాలతో కూడిన శిక్షణ అందజేశారు. శిక్షణలో వివిధశాఖల మండల అధికారులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోర వికాసం

గడివేముల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యుక్త వయసు బాలికల ఉజ్వల భవిష్యత్తు కిషోర వికాసం కార్యక్రమం దోహదపడుతుందని అదనపు సీడీపీవో పద్మావతి, ఎంపీడీవో వాసుదేవగుప్త అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, మహిళా సంరక్షకులకు కిషోరి వికాసంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని అన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం అన్నారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. అనంతరం కిషోర వికాసం గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతకు గురికాకుండా చూసుకోవాలి

నంద్యాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కౌమార దశలో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు రక్తహీనతకు గురికాకుండా చూసుకోవాలని మిషన్ పింక్ హెల్త్ విభాగం కార్యదర్శి డా.సుసుమ అన్నారు. నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో కౌమార బాలికలకు స్థానిక గురురాజా పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డా.మధుసూదన్‌రావు, మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డా.నెరవాటి అరుణకుమారి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. రుతుక్రమంలో పాటించాల్సిన పరిశుభ్రతావిధానాలు, వచ్చే ఇబ్బందులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను గుర్తించడం, రక్తహీనతకు లోనుకాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి మిషన్ పింక్ హెల్త్ విభాగం కార్యదర్శి డా.సుసుమ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.అనూష, డా.శ్రీవాణి సంపత్ పాల్గొన్నారు.

వెలుగోడు: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఎంఈవో బ్రహ్మంనాయక్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, జీఎంఎస్‌కే, నోడల్ ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్‌లకు కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. అలాగే మెరీబా సంస్థ ప్రతినిధి జుల్ఫీకర్‌అలిఖాన్ ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుందో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని పీడీ లీలావతి తనిఖీ చేశారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు ఈఢ ఆర్డీ మురారీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీదేవి, హెచ్ఏ వరలక్ష్మీ, సూపర్‌వైజర్లు కోమల, సూర్యకుమారి, వినోలియా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ భాషల ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ గెలివి సహదేవుడు

నంద్యాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన భారతీయ సంస్కృతుల వారసత్వంలో ప్రాంతీయ భాషల ఔన్నత్యాన్ని యువత తెలుసుకోవాలని సాహితీ స్రవంతి అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు గెలివి సహదేవుడు అన్నారు. బుధవారం నంద్యాలలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో ప్రముఖ తమిళ కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి, దేశభక్తుడు సుబ్రహ్మణ్యం భారతి జయంతి నిర్వహించారు. డా. గెలివి సహదేవుడు, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుబ్రహ్మణ్యం భారతి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలుగు, ఇంగ్లీష్ విభాగాల ఆధ్వర్యంలో సాహితీ సదస్సు నిర్వహించారు. అతిథులు మాట్లాడుతూ జాతీయవాదిగా, ఆధునిక తమిళ సాహిత్యానికి సుబ్రహ్మణ్యం పితామహుడిగా ప్రసిద్ధికెక్కారని కొనియాడారు. భాషల పట్ల విద్యార్థులు అవగాహన, ఔన్నత్యం కలిగి ఉండాలని, మనోదౌర్బల్యం నుంచి బయటపడి విజ్ఞాన సముపార్జనలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, తెలుగు విభాగ అధ్యాపకురాలు డా.లలితా సరస్వతి, మోహన్‌రావు, ఇంగ్లీష్ విభాగం అధ్యాపకులు హిమబిందు, సాజిదా, రాజా, ఇతర విభాగాల అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఏపీజీ బ్యాంకు చేయూత



స్కాలర్‌షిప్‌ల చెక్కులు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

పాణ్యం, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలపనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులకు పాణ్యం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు స్కాలర్‌షిప్ నగదును అందజేశారు. బుధవారం పాఠశాలకు చెందిన 9, 8, 7 తరగతుల విద్యార్థినులు ప్రశాంతి, ప్రవళ్లిక, వైష్ణవిలకు ఒక్కొక్కరికీ రూ. ఐదు వేల నగదును విద్యార్థినుల బ్యాంకు అకౌంట్లకు జమచేశారు. బ్యాంకు మేనేజరు సురేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈ విద్యార్థినులు చదువులో టాపర్స్‌గా నిలిచారన్నారు. నగదు మొత్తాన్ని చదువుకు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని మిగతా విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు సరస్వతి, చంద్రుడు, సుధాకర్‌రెడ్డి, మాబుబాషా పాల్గొన్నారు.

నంద్యాలలో శౌర్య యాత్ర



శౌర్యయాత్రలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో విశ్వహిందూ పరిషత్,భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం శౌర్యయాత్ర నిర్వహించారు. టక్కెమార్కెట్ యార్డు నుంచి హిందువులు హాజరై బైక్ ర్యాలీని ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రం విష్ణువర్ధన్‌రెడ్డి హిందూ సంఘటిక శక్తిని జాగృత పరిచే దిశలో భాగంగా శౌర్య యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించే సంకల్పంతో జనవరి 5న విజయవాడలో జరిగే శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలెపల్లి సందీప్ మాట్లాడుతూ భారతదేశం చుట్టుపక్కల ఉండే దేశాల్లో మైనార్టీలైన హిందువులపై దాడులు అధికమయ్యాయన్నారు. దేశంలోని హిందువులంతా సంఘటితమై కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. హిందూ సమాజం జాగృతి కావాలని, ఐకమత్యంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పోలెపల్లి సందీప్, కన్నయ్య, కశెట్టి చంద్రశేఖర్, ఇనుగూరి రమేష్, వరప్రసాద్, శివ, కిరణ్, శ్రీకాంత్, నాగరాజు, రవితేజ, వివిధ ధార్మిక, కుల సంఘాల పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గీతా జయంతి

పాములపాడు, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలోని నాగసాయి బ్రహ్మ విద్యాశ్వరమంలో పీఠాధి పతి శ్రీరామానంద స్వామి ఆశ్రమంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా గీతా జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా మహారాష్ట్ర కనవసూల్ సరగీవ్వరసంస్థాన పీఠాధిపతి సిద్ధేశ్వర శివాచార్య స్వాములు పాల్గొని గీతా మహాయజ్ఞాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు.అనంతరం భగవద్గీత సారాంశాన్ని పీఠాధితులు తమ ప్రవచనాల ద్వారా భక్తులకు వివరించారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తాజయసూర్య, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జయంతి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పద్మావతీనగర్‌లో వెలసిన శ్రీకృష్ణమందిరంలో బుధవారం శ్రీకృష్ణజయంతి సందర్భంగా శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు పార్థసారధిక్రిష్ణ, విజయచంద్రుడు ఆధ్వర్యంలో భవద్గీత పుట్టిన రోజు సందర్భంగా భక్తులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉమా మహేశ్వర ఆశ్రమంలో గీతా జయంతి పురస్కరించుకొని ఉరవకొండ గవిమఠం కరిబసవరాజేంద్రస్వామిచే కఠోపనిషత్తు, భగవద్గీతలోని భక్తియోగంలని శ్లోకాలకు వివరణ ఇచ్చారు.

సేవతోనే జీవితానికి సార్థకత


బాధితుడికి చెక్కు పంపిణీ చేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అభినందనీయమని, సేవతోనే మానవ జీవితానికి సార్థకత లభిస్తుందని బనగానపల్లె మాజీ సర్పంచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు వసుధ ఫౌండేషన్ అందిస్తున్న రూ.30వేల చెక్కును బీసీ రాజారెడ్డి పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వంతెన రామరాజు, టంగుటూరు శీనయ్య సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగేంద్రరెడ్డి, నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడండి : పీడీ

కోవెలకుంట్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం వీడి పని చేయాలని ఉపాధిహామీ పీడీ జనార్దన్‌రావు తెలిపారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయ భవనంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులాలను లబ్ధిదారులు త్వరగతిన పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు. విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీవిద్య, టెక్నికల్ అసిస్టెంట్లు జయభరత్‌రెడ్డి, రాధాదేవి, ప్రసాద్‌రెడ్డి, ఫక్రుద్దీన్, కొండయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


అక్షయ

రుద్రవరం, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు రుద్రవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అక్షయ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు బుధవారం తెలిపారు. అండర్-14 విభాగంలో విద్యార్థిని ఎంపికైందన్నారు. ఈనెల 19నుంచి 24 వరకు ఛత్తీ‌స్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ జరుగనున్న పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. అక్షయను పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ షేక్ షావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు పరచండి

డోన్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న కలెక్టరేట్ ముందు చేపట్టనున్న పోస్టర్‌ను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో విడుదల చేశారు. సమావేశంలో డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, డోన్, బేతంచెర్ల వైసీపీ నాయకులు రామచంద్రుడు, సోమేష్ యాదవ్, తిరుమలేశ్వర్ రెడ్డి, సీతారామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలపై నియంత్రణ తగదు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

శిరివెళ్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ ఏమాత్రం తగదని విశ్వహిందూపరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య అన్నారు. హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ జనవరి 5, 2025న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావానికి హిందువులంతా తరలిరావాలని పిలుపునిస్తూ శిరివెళ్లలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు సుబ్బారెడ్డి, పార్వతీశం, భజరంగదళ్ నాయకులు నాగిరెడ్డి, కమతం రాజశేఖర్‌రెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, చంద్ర, మునీశ్వరరెడ్డి, వరప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, రాము, రమణ, మహేష్ పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

అవుకు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగం బోడు గ్రామ పరిసర ప్రాంతాల్లోని నాటుసారా బట్టీలపై దాడులు జరిపినట్లు ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడులో 2,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, బనగానపల్లె, కోవెలకుంట్ల ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటను ముంచెత్తిన నక్కలవాగు

సంజామల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నక్కలవాగు ఉప్పొంగి ప్రవహించడంతో చేతికొచ్చిన వరి పంట వరద ముంపునకు గురైందని రైతులు లబోదిబోమంటున్నారు. ఓ ప్రక్క తుఫాను వరి రైతులను దెబ్బతీయగా మరి కొందరు నక్కల వాగు ఆగ్రహానికి గురయ్యారు. ఆల్వకొండ రస్తాలో దాదాపు 30 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టి పండించిన పంట కోత దశలో వరద ముంపుకు గురి కావడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తగిన సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

ఉయ్యాలవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యం అయినట్లు హెడ్ కానిస్టేబుల్ నూర్‌అహ్మద్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు యువతి తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు అదృశ్య కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

దొర్నిపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయాధికారిణి ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం వలన తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం శనగ పంటలో వచ్చే చీడపీడలు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

ఉయ్యాలవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి గురు , శుక్రవారాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో ఉమ మహేశ్వర రావు బుధవా రం తెలిపారు. శిక్షణకు ప్రతి ఒక్కరూ హాజరు అవ్వాలని ఆయన కోరారు.

అన్నదాతలపై అదనపు భారం

- తుఫాను ప్రభావంతో నేలకొరిగిన వరి పైరు
- చైన్ మిషన్లకు పెరిగిన డిమాండ్


శిరివెళ్లలో చైన్ మిషన్‌తో కోత కోయిస్తున్న రైతు


శిరివెళ్లలో నిలిచిపోయిన వరి కోత టైర్ల యంత్రాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని శిరివెళ్ల, రుద్రవరం, చాగలమర్రి తదితర మండలాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గత వారంలో తుఫాను ప్రభావంతో నియోజకవర్గంలో వేల ఎకరాల్లో వరి పైర్లు నేలవాలాయి. తుఫాను ముగిసిందనుకునేలోనే మరో రెండు రోజుల్లో మళ్లీ అకాల వర్షాలు పొంచి ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆరుగాలం శ్రమించి వేల రూపాయాలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటల దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో వరికోతలను ముమ్మరం చేశారు. వర్షాలు కురవక ముందు రైతులు టైర్ మిషన్ల ద్వారా కోతలు చేపట్టారు. ఇందుకు రైతులు ఒక గంట సమయానికి రూ.2 వేలు చెల్లించేవారు. చాలా వరకు టైర్ మిషన్లతోనే రైతులు కోతలు పూర్తి చేసుకునేవారు. తుఫాను కారణంగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో వరి పైర్లు నేలవాలడంతో పాటు పొలాలు నేటికీ ఆరడం లేదు. దీంతో తప్పనిసరిగా చైన్ మిషన్ తోనే కోతలు కోయాల్సిన పరిస్థితి నెలకొంది సాధారణంగా చైన్ మిషన్‌కు గంటకు రూ.3 వేల నుంచి రూ.3,200 వరకు రైతులు చెల్లిస్తున్నారు. తుఫాన్ వల్ల పరిస్థితి మారిపోవడంతో చైన్ మిషన్లకు డిమాండ్ పెరిగింది. గతంలో ఒక ఎకరా కోసేందుకు ఒక గంట నుంచి 1.10 గంటల సమయం పడుతుండేది. ప్రస్తుతం నేలవాలిన వరి పైర్లను కోయాలంటే ఎకరాకు రెండు నుంచి మూడు గంటల సమయం పడుతోంది. దీంతో ఎకరాకు దాదాపు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు అదనపు భారం పడుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులపాలవుతున్నామని అన్నదాతలు కన్నీటిపర్యంతమవుతున్నారు.

అర్హులందరికీ గృహాలు మంజూరు : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ సభ్యత్వం నమోదుపై బూత్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గూడు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, కట్టుకునేందుకు బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, సోమశేఖర్ రెడ్డి, భీమేశ్వరరెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బజాజ్ రామిరెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, మేకల నాగరాజు, రూబెన్, రవీంద్ర నాయక్, టైలర్ రాముడు, మురళి, మధులోకేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర ఆచారి, కానాల అంజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుహల అభివృద్ధికి అన్ని ఏర్పాట్లు చేస్తాం

కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న బిల్వ స్వర్గం గుహల అభివృద్ధికి అన్ని ఏర్పాటు చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం బిల్వ స్వర్గం గుహలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుహలను సందర్శించే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తామన్నారు. అలాగే హనుమాన్‌నగర్ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎమ్మెల్యే కోట్ల తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



ప్యాపిలిలో సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

ప్యాపిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నివారించాలని సీడీపీవో షంషద్‌బేగం అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగనవాడీ, ఆశా వర్కర్లు గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే ఐసీడీఎస్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కిశోర బాలికలు చదువు కొనసాగించేలా చూడలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో వెంకటేశ్వరనాయక్, అంగవాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి: బాల్య వివాహాలను చేయరాదని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి సూచించారు. బుధవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో కిశోర బాలికల కోసం కార్యక్రమంపై ఐడీసీఎస్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిచారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో లీగల్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఎంఈవో అనూరాధ, ఏపీఎం నాగమ్మ, సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల : బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ ఆళ్లగడ్డ సీడీపీవో తేజేశ్వరి అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. పౌష్టికాహార లోపం వల్ల శిశువులు, కౌమార బాలికలు, మహిళల్లో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ శిరివెళ్ల సూపర్‌వైజర్ సువర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


చాగలమర్రిలో ఒంటెద్దు బండి పోటీలను ప్రారంభిస్తున్న అన్సర్‌బాషా

చాగలమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో సత్యమ్మ దేవత ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ఒంటెద్దు బండలాగుడు పోటీలను టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా ప్రారంభించారు. ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 15 ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దులకు దాతలు నగదును అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, నంద్యాల మైనార్టీసెల్ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మాబు షరీఫ్, టీడీపీ నాయకులు మౌలాలి, అనిఫ్, మాబులాల్, నరసింహులు, జల్‌సాగొస్‌మోద్దిన్, మహబూబ్‌బాష, ఓబులేసు, రైతులుపాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి ఇంటి దగ్గర సామాజిక సభ

- అభ్యంతరం వ్యక్తం చేసిన టీడీపీ నాయకులు


కేపీ తండాలో వైసీపీ నాయకుడి ఇంటి వద్ద కూర్చున్న ఏపీవో, అధికారులు

చాగలమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ తండా గ్రామంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీపై గ్రామసభను బుధవారం నిర్వహించారు. అయితే గ్రామసభ సేవాలాల్ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఉపాధి హామీ సామాజిక బృంద అధికారులు, ఏపీవో వైసీపీ నాయకుడి ఇంటి వద్ద జరుపడంతో టీడీపీ వర్గీయులు బాల స్వామినాయక్, చంద్రనాయక్, కృష్ణనాయక్, శ్రీరామ్‌నాయక్, నాజానాయక్, రవినాయక్ అడ్డుకున్నారు. దాంతో అధికారులు వాయిదా వేశారు. ఈ విషయంపై ఏపీవో నిర్మలను వివరణ కోరగా సామాజిక తనిఖీ సభను వాయిదా వేశామన్నారు.

భక్తి శ్రద్ధలతో గీతా జయంతి


చాగలమర్రిలో గీతా పారాయణం చేస్తున్న మహిళలు


బెలుం గ్రామంలో గీతా పారాయణంలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతా జయంతి వేడుకలను బృందావనం శ్రీకృష్ణుని దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం దేవాలయం నుంచి శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో ఏర్పాటు చేసి హిందూ ధర్మపరిరక్షణ సమితి, భజరంగ్‌దళ్ బృందావనం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటాలు ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో చంద్రమౌళేశ్వర్ రెడ్డి, పద్మనాభం, విశ్వనాథరెడ్డి, గూని నాగరాజు, సీతారామచంద్రుడు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక సరస్వతి శిశుమందిరంలో బుధవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీతకు, శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వక్తలు భగవద్గీత విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందుపరిషత్ ప్రచారకులు దేవిదయానంద్‌సింగ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో ఆలయ నిర్వాహకులు బాచం శివారెడ్డి ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు వైవీఎస్ నారాయణరెడ్డి గీతా పారాయణం చేశారు. నాయకులు గూడూరు నాగేశ్వరరెడ్డి, భక్తులు జనార్ధనరెడ్డి, రామచంద్రారెడ్డి, బెలుం శేఖర్, రామయ్య, అర్చకులు రాంప్రసాద్ భక్తులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని శివ రామానంద ఆశ్రమంలో పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో గీతా జయంతిని నిర్వహించారు. మహిళలు సామూహికంగా గీతాపారాయణం చేశారు. చింతలచెరువు గ్రామానికి చెందిన ఎస్ఎస్ఎఫ్ సభ్యులు మేడా ఓబులేసు, విశ్వనాథ్‌రెడ్డి, కలందర్‌రెడ్డి, మునేష్‌రెడ్డి, మహేష్, రామకృష్ణారెడ్డితో కలిసి యువకులు మోటార్ సైకిళ్లపై చింతలచెరువు, చాగలమర్రి గ్రామాల్లో జైశ్రీరామ్ అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శిరివెళ్ల : మండలంలోని యర్రగుంట్ల సద్గురు రామకృష్ణానంద గీతాశ్రమంలో గీతా జయంతి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


శ్రీకృష్ణుడి రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో కుందూ నది ఒడ్డున వెలసిన వేణుగోపాల స్వామి ఆశ్రమంలో బుధవారం గీతాజ యంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. సుబ్బారెడ్డిస్వామి శిష్యులు మహానందరెడ్డి, నాగేశ్వరరెడ్డిలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, మహిళలు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- తహసీల్దార్ రవికుమార్



చాగలమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: రెవెన్యూ సదస్సులతో ప్రయోజనం ఉందా?

జవాబు: రైతుల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది.

ప్రశ్న: రీసర్వే గ్రామసభలు ఎలా జరుగుతున్నాయి?

జవాబు: మండలంలో మొదటి విడత 8 గ్రామాల్లో రీసర్వే నిర్వహించాం. 350 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 200 దరఖాస్తులు పరిష్కరించాం. ప్రస్తుతం రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. రైతుల అభ్యంతరాలను, అర్జీలను స్వీకరిస్తున్నాం.

ప్రశ్న: సాగునీటి సంఘాల ఎన్నికలకు రైతుల జాబితా సిద్ధం చేశారా?

జవాబు: సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రైతుల జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. మండలంలో 11 సాగు నీటి సంఘాలు, 108 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తాం. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చాం.

ప్రశ్న: రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతుందా?

జవాబు: గ్రామాలలో ఇంటింటికి రేషన్‌ను ఎండీయూ ఆపరేటర్లచే వాహనాల ద్వారా పంపిణీ జరుగుతోంది. బియ్యం పంపిణీ చేయలేదని కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వాహనదారులపై చర్యలు తీసుకుంటాం.

సెస్సు వసూళ్లలో కోవెలకుంట్ల మార్కెట్ రికార్డు

కోవెలకుంట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు సెస్సు వసూళ్లలో లక్ష్యాన్ని అధిగమించి రికార్డు సృష్టించినట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి జయప్రకాశ్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, కోవెలకుంట్ల మార్కెట్‌కు రూ.84లక్షలు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటికే మార్కెట్ కమిటీ రూ.85లక్షలు సాధించి, లక్ష్యాన్ని అధిగమించినట్లు తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

బేతంచెర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ వర్తింపజేస్తామని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్రనాయక్, యూనిట్ ఇన్‌చార్జి టైలర్ రాముడు అన్నారు. బుధవారం పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో టీడీపీ సభ్యత్వం కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి టైలర్ రాముడు, కౌన్సిలర్ యూనిట్ ఇన్‌చార్జి రామాంజనేయులు, నాయకులు రవీంద్రనాయక్, సుంకన్న, పులి అశోక్, బాలాజీ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నక్కి శ్రీకాంత్



డోన్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా డోన్ పట్టణం కొండపేటకు చెందిన నక్కి శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నందికొట్కూరులో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా మహాసభల్లో నక్కి శ్రీకాంత్‌ను జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకోవడంపై ఆ పార్టీ డోన్ మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, సీఐటీయు నాయకులు చిన్న రెహిమాన్, డీవైఎఫ్ఐ నాయకులు నక్కి హరి, ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్ హర్షం వ్యక్తం చేశారు.

మిత్రుడి కుటుంబానికి అండ

కోవెలకుంట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమతో కలిసి చదువుకున్న మిత్రుడు మృతి చెందడంతో మానవతా దృక్పథంతో స్నేహితులు రూ.60వేలు ఆర్థిక సహాయం అందించారు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేసే పీసీ వెంకటరమణ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో 1998-99 బ్యాచ్‌కి చెందిన సహ విద్యార్థులు బుధవారం రూ.60వేలు అందజేశారు. దీంతో పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు.

పురపాలక సంఘం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


కమిషనర్ కిషోర్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పురపాలక సంఘం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ కిషోర్ తెలిపారు. ఆళ్లగడ్డ నూతన కమిషనర్‌గా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి సెలవుపై వెళ్లడంతో కడప నగరపాలక సంస్థలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిషోర్‌ను ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా (ఎఫ్ఏసీ) ఉన్నతాధికారులు నియమించారు. పట్టణంలోని మౌలిక సదుపాయాలు, సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.

గోశాలకు గడ్డి వితరణ

బనగానపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణానికి చెందిన ముస్లిం నాయకుడు సయ్యద్ అబ్బాస్ బుధవారం గోశాలకు నాలుగు ట్రాక్టర్ల వరి గడ్డి వితరణ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అభినందించారు. కార్యక్రమంలో టంగుటూరి శీనయ్య పాల్గొన్నారు.

శబరిమలకు సైకిల్ యాత్ర

చాగలమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు నుంచి శబరిమలైకు సైకిల్‌యాత్ర చేస్తూ బుధవారం చాగలమర్రికి చేరుకున్నారు. అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన మాలదారులు శ్రీనివాసులు ఈనెల 8న హైదరాబాదులో సైకిల్ యాత్ర ప్రారంభించారు. చాగలమర్రికి రాగానే సాయి సేవా సంఘం సభ్యులు నాగభూషణం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సాయి సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై విచారణ

చాగలమర్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు, కేపీ తండా గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై గ్రామ సభలు నిర్వహించారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ మురాద్, డీఆర్పీలు గ్రామసభలు నిర్వహించి ఉపాధి పనుల నివేదికలను ప్రకటించారు. గొట్లూరు గ్రామంలో రూ.25.30 లక్షలతో ఉపాధి పనులు చేపట్టామన్నారు. మెటీరియల్ రూ.3.61 లక్షలు, హార్టికల్చర్ కింద 5 పనులు చేసినట్లు డీఆర్పీ నరేంద్ర పేర్కొన్నారు. కేపీ తండాలో 43 పనులకు రూ.26.87 లక్షలు, మెటీరియల్ ప నులకు రూ.90 వేలు, హార్టికల్చర్‌కు 20 పనుల కోసం రూ.27 లక్షలు ఖర్చు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

ఉయ్యాలవాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం అల్లూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేసి రెవెన్యూ సదస్సుల ప్రాముఖ్యంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్వోలు ఉన్నారు.